అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలి

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 3 : మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందేలా చూడాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ రాజేందర్‌కుమార్ సూచించారు. మండలంలోని అర్గుల్ శివారులోని మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ప్లాంట్‌లో గురువారం నిర్వహించిన వాటర్‌మెన్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. తాగునీటి సరఫరాలో అలసత్వం లేకుండా ప్రతి సహాయకుడు పని చేయాలని సూచించారు. నీటి సరఫరాలో లీకేజీలుంటే వెంటనే సరి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ నరేశ్, డిప్యూటీ ఈఈ గంగారాం, ఏఈ మోహన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్, ఎంపీడీవో సతీశ్‌కుమార్, ఎంపీవో యూసుఫ్ ఖాన్, ఎఫ్ఏ ఆకుల గోపి, చైర్మన్లు రోడ్డ సాయన్న, మధు, సహాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

కంఠేశ్వర్,అక్టోబర్ 3: రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోచారం హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జూనియర్ బాలుర బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపించిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు నేటి నుంచి 6వ తేదీ వరకు కామారెడ్డిలో నిర్వహించనున్న 69వ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కంఠేశ్వర్, అక్టోబర్ 3: కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 26వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కానీ ప్రభుత్వాలు అమలుచేయడంలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్, సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్ ఉన్నారు.

టీయూ భూములను కాపాడాలని ఆందోళన

టీయూ ప్రధాన గేట్ వద్ద ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, అక్టోబర్ 3: తెలంగాణ యూనివర్సిటీకి సంబంధించిన 50 ఎకరాల భూమిని కాపాడాలని, కబ్జా చేస్తున్న వారితోపాటు సహకరిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టీయూ ప్రధాన ద్వారం వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, రవీందర్, శివ సాయి, వంశీ, రాకేశ్ స్రవంతి, రచన, గౌతమి, ప్రియ, రమ్య పాల్గొన్నారు.

చందూర్ మండలంలో వర్షం

చందూర్ అక్టోబర్ 3: మండలంలో గురువారం జోరువాన కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వరి నేలకొరిగింది. ఈదురుగాలులతో కూడిన వాన కురవడంతో చేతికొచ్చిన వరి పంట దెబ్బతిన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

నమస్తే తెలంగాణ యంత్రాంగం: జిల్లాలో బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. రెండోరోజైన గురువారం అటుకుల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. అందంగా పేర్చిన బతుకమ్మలను ఆలయాల ప్రాంగణాల వద్ద ఉంచి ఆడిపాడారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, హమాల్‌వాడీ సంతోషిమాత మందిరం, కిషన్‌గంజ్ వాసవీమాత మందిరం, శంభునిగుడి, చక్రంగుడి, పెద్ద రాంమందిరం తదితర ప్రాంతాల్లో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తెలంగాణ యూనివర్సిటీలో బతుకమ్మ సంబురాలను రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి ప్రారంభించారు.

హమాల్‌వాడిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బోధన్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పాతంగల్ మండలం కొడిచర్లలో..

తెలంగాణ యూనివర్సిటీలో బతుకమ్మ సంబురాలు

బోధన్‌లో బతుకమ్మలతో చిన్నారులు

కమిషనరేట్‌లో 'డ్యూటీ మీట్'

సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

వినాయక్‌నగర్, అక్టోబర్ 3: పోలీస్ విధి నిర్వహణలో సామర్థ్యం పెంపుదలకు రాష్ట్రంలో మొదటి డ్యూటీ మీట్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి సీఐలు, ఎస్సైలు హాజరయ్యారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా నేరం జరిగిన ప్రదేశంలో సేకరించాల్సిన సమాచారం, 'పోలీస్ క్లూస్' ఏ విధంగా సేకరించాలనే అంశంపై ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీస్ హెడ్ క్వార్టర్స్ గ్రౌండ్, పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం, పోలీస్ కార్యాలయంలో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ సమక్షంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బందికి ఎంపిక పరీక్షలు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు కోటేశ్వర రావు, శంకర్ నాయక్, సీసీఎస్, సీసీఆర్‌బీ ఏసీపీలు నాగవేంద్రచారి, రవీందర్ ఫోరెన్సిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో డీజే వాడకంపై నిషేధం

ఏసీపీ రాజా వెంకటరెడ్డి

జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న ఏసీపీ రాజా వెంకటరెడ్డి

వినాయక్‌నగర్/ రుద్రూర్/ ఇందల్వాయి, అక్టోబర్ 3: జిల్లాలో డీజే వినియోగాన్ని నిషేధించినట్లు సీపీ కల్మేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట రెడ్డి సూచించారు. నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో డీజే, సౌండ్ సిస్టం యజమానులు, విక్రయదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సౌండ్ సిస్టం వాడకం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఇక నుంచి డీజేలు ఉండాలంటే నిర్వాహకులు పోలీసు కమిషనర్ నుంచి లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి,నగర సీఐ శ్రీనివాస్ రాజ్,సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ పోలీసు స్టేషన్‌లో వర్ని, రుద్రూర్, కోటగిరి పీఎస్‌ల పరిధిలోని డీజే నిర్వాహకులతో బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. డీజే యజమానులు, డీజే లీజుకు తీసుకున్న ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, లేదంటే డీజేలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను ఆనందంగా ప్రశాంతంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సీఐ జయేష్‌రెడ్డి, ఎస్సై సాయన్న, డీజేల యజమానులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో డీజేలను నిషేధిస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో ఇప్పటి నుంచి డీజేలు, సౌండ్‌బాక్స్‌లు ఉపయోగించరాదని, ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దుర్గామాత మండపాల వద్ద రాత్రిపూట భవానీ స్వాములు ఉండాలని, శాంతియుతంగా నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని సూచించారు.

నగరంలో 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' సర్వే

సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ మకరంద్

కంఠేశ్వర్, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్యామిలీ డిజిటల్ కార్డులను జారీ చేసేందుకు ప్రయోగాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియ గురువారం జిల్లాలో ప్రారంభమైంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో నోడల్ అధికారులు సర్వే నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని 38 వ డివిజన్‌లో చేపట్టిన సర్వేను నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, నగర మేయర్ నీతూకిరణ్ పర్యవేక్షించారు. తప్పులు లేకుండా సర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. వారి వెంట డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ జనార్దన్ తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

వినాయక్‌నగర్, అక్టోంబర్ 3: హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న మహమ్మద్ అబ్దుల్ కలీమ్ పై పోలీసుల భౌతిక దాడి అత్యంత హేయమైన చర్య అని నిజామాబాద్ బార్ అసోసియేషన్ బాధ్యులు పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. న్యాయవాదిపై దాడి చేసిన మాదన్నపేట్ పోలీసులను అరెస్టు చేసి చట్ట ప్రకారం శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, సీనియర్,జూనియర్ న్యాయవాదులు ఎర్రం గణపతి,భాస్కర్, పరుచూరి శ్రీధర్, శంకర్, వసంత్ రావు, సురేశ్, మధుసూదన్ రావు, కవితారెడ్డి,మాణిక్ రాజు, ఆశ నారాయణ, వెంకటేశ్, నరేశ్, రవీందర్, సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో శ్రమదానం

ప్లాట్‌ఫామ్‌ను శుభ్రం చేస్తున్న అధికారులు

కంఠేశ్వర్/ వినాయక్‌నగర్, అక్టోబర్ 3: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రమదానం నిర్వహించినట్లు హైదరాబాద్ రైల్వే డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ సాల్వన్‌సంగ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వచ్ఛత ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్, రైల్వేస్టేషన్ మేనేజర్ సదాశివుడు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ సాగర్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్,అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ దీప, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే ధన్‌పాల్

కంఠేశ్వర్, అక్టోబర్ 3: నగరంలోని 16, 20వ డివిజన్లలో రూ. 20 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు మేయర్ నీతూ కిరణ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం భూమిపూజ చేశారు. మేయర్ మాట్లాడుతూ..నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు న్యాలం రాజు, పంచరెడ్డి ప్రవళిక, కాలనీ వాసులు పాల్గొన్నారు. నగర మేయర్ నాందేవ్‌వాడలోని లిటిల్‌హార్ట్స్, లిబర్టీ పాఠశాలల్లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో డీఎస్‌వో అరవింద్ రెడ్డిని నిజామాబాద్ పెట్రోలియం అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మంచాల శంకయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా డీఎస్‌వోకు భగవద్గీతను బహూకరించారు. అధ్యక్షుడు వినోద్‌కుమార్, కార్యదర్శి ప్రతాప్‌గుప్తా తదితరులున్నారు. -ఖలీల్‌వాడి అక్టోబర్ 3

సంక్షిప్తంగా..

- **ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత:** కోటగిరి, అక్టోబర్ 3: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బోలేరో వాహనాన్ని పట్టుకున్నట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. పొతంగల్ మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి రాంపూర్ మీదుగా బోలేరో వాహనంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా.. పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనాన్ని తహసీల్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.
- **రుణమాఫీ కానీ వారు దరఖాస్తు చేసుకోవాలి :** ధర్పల్లి, అక్టోబర్ 3 : రైతు రుణమాఫీ కానీ వారు కుటుంబ నిర్ధారణతో కొత్తగా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ సూచించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రుణమాఫీ ఖాతా జిరాక్స్‌తో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డు లేక రుణమాఫీ కానీ వారు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు.
- **ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు :** ఖలీల్‌వాడి, అక్టోబర్ 3: జిల్లాలో ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు ప్రారంభమైనట్లు డీఈవో దుర్గా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు ఎస్సెస్సీ పరీక్షలకు 93 మందికి 52 మంది, ఇంటర్‌లో 81 మందికి 57 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.
- **నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం :** ఖలీల్‌వాడి అక్టోబర్ 3: జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీ తోట రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డి-9 సుభాష్‌నగర్ పరిధిలోని విద్యుత్ నగర్, కంఠేశ్వర్, హమాల్‌వాడి, హైదరాబాద్‌రోడ్, చంద్రశేఖర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొలువుదీరిన దుర్గామాత

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 3: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. మొదటి రోజు బాలత్రిపుర సుందరి దేవీగా, శైలిపుత్రిగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండలాల్లో మండపాల్లో దుర్గామాత కొలువైంది. ప్రతి గ్రామంలో భవానీ దీక్షను ప్రారంభించారు.

కందకుర్తిలో కొలువు దీరిన దుర్గామాత

కమ్మర్‌పల్లిలో డప్పులతో ఊరేగింపు

బోధన్ పట్టణంలోని శ్రీ ఏకచక్రేశ్వర శివమందిరంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా పూజలు..

నగరంలో దుర్గామాతను మండపానికి తీసుకెళ్తున్న భక్తులు



కోటగిరి సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ, భక్తులు

బినోలాలో మాలధారణ చేస్తున్న పురోహితుడు

ఎడపల్లిలో ..



నగరంలో వాసవిమాతను పూలతో అలంకరించిన దృశ్యం

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ రూరల్, అక్టోబర్ 3: రైతులు సోయాబీన్ పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లాభసాటి ధరను పొందాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దవర్ గంగారెడ్డి, శరత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంధ్యా దాము, గంగాశంకర్, శరత్‌రెడ్డి, తహసీల్దార్ విఠల్, ఏడీసీ సంతోష్‌నాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాలూరా మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి సొసైటీ చైర్మన్ అల్లే జనార్దన్, ఏఎంసీ చైర్మన్ సంధ్యాదాముతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రవళిక

బాల్కొండ, అక్టోబర్ 3 : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపికైంది. నిజామాబాద్‌లో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 తైక్వాండోలో 10వ తరగతి విద్యార్థిని పి.రవళిక ప్రతిభ చూపినట్లు పీడీ ముత్తెన్న తెలిపారు. ఈనెల 17 నుంచి 19 వరకు గద్వాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

జీపీ వాటర్ మెన్ల శిక్షణ

నవీపేట, అక్టోబర్ 3: మండలంలోని యంచ ఫీప్లోరైడ్ స్కీం వద్ద గురువారం తాగునీటి సహాయకులు జీపీ వాటర్ మెన్ల శిక్షణ తరగతులను ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ మున్ని నాయక్ ప్రారంభించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా మండలంలోని 32 గ్రామ పంచాయతీ లకు తాగునీటీ సరఫరా చేసే వాటర్ మెన్లకు మొదటిరోజు పైప్‌లైన్ లీకేజీలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ రాము పాల్గొన్నారు.

ఇంటి నంబర్లు కేటాయించాలి

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్3: ఇంటి నంబర్లు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఆపార్టీ నాయకుడు రమేశ్ బాబు మాట్లాడుతూ నిరుపేదలు ఎనిమిది ఏండ్ల నుంచి పట్టణంలో యానం గుట్ట, సుందరయ్య కాలనీలో గుడిసెలు వేసుకొని, ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. వారి ఇండ్లకు నంబర్లు కేటాయించాలని కోరారు. పార్టీ నాయకులు వెంకటేశ్, కుతాడి ఎల్లయ్య, రవి, భూమన్న, ఇడగొట్టి సాయిలు, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినికి ఆపన్న హస్తం

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్3: అనారోగ్యానికి గురైన పూర్వ విద్యార్థినికి పూర్వ విద్యార్థులు ఆపన్న హస్తం అందించారు. పట్టణంలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్సెస్సీ 1998-99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలిసి పూర్వ విద్యార్థిని జమునా నాగరాజ్‌కు రూ.44,500 ఆర్థిక సాయం అందజేశారు. జమున కొన్ని నెలల నుంచి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోందని వారు తెలిపారు.

డీజే ఆపరేటర్లకు లైసెన్స్ తప్పనిసరి

భీమ్‌గల్/శక్కర్‌నగర్, అక్టోబర్ 3: ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీజే ఆపరేటర్లు పోలీసుశాఖ వద్ద లైసెన్స్ తీసుకోవడం తప్పనిసరని ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. గురువారం భీమ్‌గల్ సర్కిల్ పరిధిలోని భీమ్‌గల్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాలకు చెందిన దుర్గాదేవి మండప నిర్వాహకులు డీజే ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీజే ఆపరేటర్లు ప్రభుత్వం సూచించిన 50 డిజిబిల్స్ కంటే ఎక్కువ సౌండ్ వచ్చే స్పీకర్లను ఉపయోగించరాదని అన్నారు. సమావేశంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు మహేశ్, రాము, విక్రమ్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. డీజేల యజమానులు, నిర్వాహకులు ఈనెల 14 వరకు శబ్ద కాలుష్య నివారణ రూల్స్ పాటించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. బోధన్ పోలీస్ స్టేషన్‌లో డీజే యజమానులు, మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. బోధన్ పట్టణ, రూరల్ సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, ఎస్సై సాయన్న పాల్గొన్నారు.

సంఘం భవనానికి విరాళం

ముప్కాల్, అక్టోబర్ 3: నాయకుడు ఫౌండేషన్ ముప్కాల్ వారి ఆధ్వర్యంలో గురువారం వేంపల్లి గ్రామంలోని విశ్వబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి తన వంతు సాయంగా రూ.25 వేలు ఫౌండర్, చైర్మన్ నాయకుడు సంతోష్, ఫౌండేషన్ సభ్యులు సంఘ సభ్యులకు అందించారు.

పూర్తి వివరాలు సేకరించాలి

బోధన్/బోధన్ రూరల్, అక్టోబర్ 3: పైలట్‌గా ఎంపిక చేసిన బోధన్ పట్టణంలోని 25వ వార్డులో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. మున్సిపల్, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామాన్ని బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామాన్ని సందర్శించి వన్ నేషన్ వన్ కార్డు కార్యక్రమంపై వివరించారు. ప్రతి ఒక్కరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మా శరత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ ఏఈ శివకృష్ణ, ఎమ్మార్వై వరుణ్‌తో పాటు పలువురు ఉన్నారు. బోధన్ తహసీల్దార్ విఠల్, ఎంపీవో మధుకర్, గ్రామస్తులు ఉన్నారు.

లారీని ఢీకొట్టి ఒకరి మృతి

మాక్లూర్, అక్టోబర్3: అడవి మామిడిపల్లి శివారులోని 63వ జాతీయ రహదారిపై గురువారం ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గుత్ప గ్రామానికి చెందిన కల్లడి ప్రసాద్(36) జిల్లా కేంద్రంలోని ద్వారకమయి టిఫిన్ సెంటర్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. పనులు ముగించికొని సాయంత్రం గుత్పకు బైక్‌పై వెళ్తున్నాడు. అడవిమామిడిపల్లి శివారులో నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపిన లారీని ఢీకొట్టాడు. తీవ్రగాయాల పాలై అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కల్లెడ శంకర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

పాముకాటుతో మహిళ ..

బోధన్ రూరల్, అక్టోబర్ 3: సాలూరా మండలంలోని తగ్గెల్లి గ్రామానికి చెందిన గంగాబాయి (68) పాటు కాటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. గంగాబాయి సొంత పొలంలో సోయా కోస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన స్థానికులు ఆమెను చికిత్స కోసం బోధన్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ ఏఎస